ప్రజాశక్తి


శనివారం 22 జూన్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి







ఇదేం.. మద్దతు



ప్రమాణ స్వీకారం చేస్తున్న అయ్యన్నపాత్రుడు

ఘనంగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

వార్త 8లో..

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, రోలుగుంట విలేకరి

- పెరుగుతున్న పెట్టుబడులు
- రెట్టింపు ఆదాయ హామీని విస్మరించిన కేంద్రం
- స్వల్పంగా పెంచిన మద్దతు ధరపై రైతులు పెదవి విరుపు
- స్వామినాథన్ సిఫార్సుల అమలుతోనే మోక్షం

కేంద్ర ప్రభుత్వం తాజాగా వరికి ప్రకటించిన కనీస మద్దతు ధర రైతుకు ఊరటనిచ్చేలాలేదు. పెరిగిన పెట్టుబడులకు, పెంచిన మద్దతు ధరకు పొంతనలేదు. ఇటీవల వరి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) క్వింటాల్‌కు రూ.117ను కేంద్రం పెంచింది. అయితే, ఎరువులు, పురుగు మందులు వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు దోహదపడ్డ పచ్చిరొట్ట విత్తనాలు మొదలుకొని, వరి, ఇతర విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు అమాంతంగా పెంచుతూ వస్తున్న ప్రభుత్వాలు ఆ మేరకు రైతు పంటకు మద్దతు ధర కల్పించడంలేదు. 2023లో రూ.4,850 వున్న క్వింటా పిల్లి పెసర విత్తనం ధరను ఈ ఏడాది ఖరీఫ్ నాటికి రూ.6,700కు ప్రభుత్వం పెంచింది. ఒక ఏడాదిలో క్వింటా పిల్లిపెసర విత్తనంపై రూ.1850 పెరగ్గా, కేంద్ర మిగతా 2లో..

పెట్టుబడులకు సరిపోదు



వరి నారు మడి దుక్కులు, విత్తనాలు, దమ్ము, చదును, ఉడుపు, డిఎపి, యూరియా, గాబులు, కోత, వరి నూర్పులకు కలిపి కుటుంబ సభ్యుల కష్టంపోనూ ఎకరాకు రూ.25,750 అవుతుంది. ఎకరాకు 20 క్వింటాల్ కంటే మించి పంట దిగుబడిరాదు. పంట పెట్టుబడికి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.117కు పొంతనలేదు. పెట్టుబడి ఖర్చులు తగ్గించి, పంటకు గిట్టుబాటు ధర కల్పించినప్పుడే రైతుకు మేలు జరుగుతుంది.

శ్రీనివాసరావు, రైతు, రోలుగుంట

టమాటా ధరలు తగ్గించే చర్యలు చేపట్టండి

మార్కెటింగ్ శాఖ అధికారులకు విశాఖ జెసి ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టమాటా ధరలు అధికంగా ఉన్నందున వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణం రైతు బజార్లలో టమాటా ధరలు తగ్గే విధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ధరల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా ఆర్టికల్చర్, ఉప మార్కెటింగ్ సంచాలకులు, జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారులు, అన్ని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు, గాజువాక హోల్‌సేల్ వ్యాపారులు పాల్గొన్నారు. టమాటా, ఉల్లిపాయలు, కూరగాయలు లభ్యతతో పాటు వాటి ధరలపై మిగతా 2లో..

శోభాయమానం.. శ్రీ వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

వార్త 2లో..

పారా అథ్లెటిక్స్ పోస్టర్ ఆవిష్కరణ

వార్త 2లో..

వేతన బకాయిలు చెల్లించకుంటే సమ్మె

వార్త 5లో..

అతిసార వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అతిసార వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అతిసార కేసులు నమోదు ,ఇతర సంఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆయా జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఎం అండ్ హెచ్ఒ, ఎంహెచ్ఒ, డిఎంఒ, జెడ్‌పి సిఇఒ, డిపిఒ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ మల్లికార్జున తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో అతిసార వ్యాప్తి చెందకుండా, డెంగీ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తాజా పరిస్థితులను గమనించాలన్నారు.

ఉక్కు ఆస్తుల అమ్మకం నిలిపివేయాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోని ప్రధాన నగరాలైన ముంబయి, ఢిల్లీ, చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్‌ల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న సుమారు రూ.500 కోట్ల విలువైన భూములను, ఆస్తులను అమ్మే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఆస్తుల అమ్మకం స్టీల్‌ప్లాంట్ వ్యాపారాన్ని, అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని, ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. విశాఖలోని స్టీల్‌ప్లాంట్ భూములను అమ్మకానికి పెట్టడం, గంగవరం పోర్టు భూములను మోడీ తన ప్రియ మిత్రుడైన అదానీకి కట్టబెట్టడం వంటి చర్యలకు పాల్పడగా ప్రజలు, కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఇప్పుడు చెన్నయ్ భూములపైన అదానీ కన్ను పడిందని తెలిపారు. కీలక నగరాల్లో ఉన్న ఉక్కు గెస్ట్ హౌస్, మార్కెటింగ్ కార్యాలయాలు, భవనాలు, యార్డుల అమ్మకానికి పూనుకోవడం ఒక పథకం ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడమేనని తెలిపారు. ఒకవైపు సంస్థ ఉద్యోగులకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ప్లాంట్‌ను కష్టాల్లోకి నెడుతూ, మరోవైపు ఆస్తులు తెగనమ్మడానికి పూనుకోవడం స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరచడమేనన్నారు. బిజెపి నాయకత్వంలోని కేంద్ర ఎన్‌డిఎ ప్రభుత్వం తక్షణమే స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌కు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం అందించడం వంటి సానుకూల చర్యలు కేంద్రం చేపడితే స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పడుతుందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించడమే కాకుండా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల పన్నులు, డివిడెంట్ల రూపంలో ఆదాయం సమకూరుస్తున్న విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఆ మేరకు మోడీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోదని జగ్గునాయుడు ప్రశ్నించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం బిజెపి, టిడిపి కూటమి ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. కేంద్రంలో సంకీర్ణ ఎన్‌డిఎ ప్రభుత్వం, ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఇదేం మద్దతు

ప్రభుత్వం క్వింటా వరిపై రూ.117 పెంచింది. నెల్లూరు సన్నాలు 34449 రకం వరి విత్తనాల ధర 2023లో రూ.2,410 వుండగా ఈ ఏడాది రూ.3050కు రైతుకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. గతేడాది కంటే ఈ ఖరీఫ్ నాటికి నెల్లూరు సన్నాలు క్వింటా వరి విత్తనంపై రూ.640 పెంచింది. ఇంకా ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. సరాసరి ఎకరాకు 20 క్వింటాల్ వరి పండించిన రైతు తమ పంటను అమ్ముకోగలిగితే ప్రస్తుత ధర కంటే అదనంగా వచ్చే ఆదాయం రూ.2,340 మాత్రమే.

ఆకు మడులు దున్నినప్పటి నుంచి వరి పంట నూర్పిడి వరకు వివిధ రూపాల్లో రైతు (తమ కుటుంబ శ్రమపోనూ) పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.25,750 అవుతోంది. వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలంగా వుండి, ఎకరాకు 20 క్వింటాల్ వరి దిగుబడి వస్తే ప్రభుత్వం పెంచిన మద్దతు ధర రూ.117తో కలుపుకొని వరి సాధారణ రకం రూ.2,300 చొప్పున ఎకరా పంట 46 వేలకు వస్తుంది. దీంట్లో కుటుంబ శ్రమ దాదాపు పది వేలు, పెట్టుబడి ఖర్చు రూ.25,750పోతే రైతుకు మిగిలినట్లు కన్పించే ఆదాయం కేవలం పది వేలు. నీటి వసతిలేని ప్రాంతాల్లో పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. సకాలంలో నీటి తడులు లేక పంట దిగుబడులు తగ్గుతుంటాయి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి రైతును ఆదుకోవాలని సిఫార్సు చేసింది. కానీ మోడీ ప్రభుత్వం రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. సబ్సిడీ తగ్గించడంతో రైతు పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 3.90 లక్షల మంది రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు 3.75 లక్షల మంది వున్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధర కంటితుడుపు చర్యగా వుంది తప్పితే ఆదుకొనేలా లేదని రైతులు వాపోతున్నారు.

క్వింటా వరి మద్దతు ధర

వరి రకం	2023-24	2024-25	పెరుగుదల
సాధారణం	రూ.2,183	2,300	117
ఎ గ్రేడ్	రూ.2,203	2,320	117

ఉక్కు ఆస్తుల అమ్మకం నిలిపివేయాలి

నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపి, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కార్మికులు, ప్రజలు ఆశాభావంతో ఉన్నారన్నారు. వారి ఆశలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకాన్ని ఆపించి, ప్లాంటుకు ఆర్థికంగా బలం చేకూర్చే అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులను కేంద్రం విడుదల చేయాలి : సిఐటియు

స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులను కేంద్రం తక్షణం విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ఆస్తుల అమ్మకానికి మరొకసారి కేంద్రం సిద్ధపడుతోందని తెలిపారు. ఎంతో విలువైన ఆస్తులను కేవలం రూ.475 కోట్లకు అమ్మడం దారుణమని పేర్కొన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ఆర్ఐఎన్ఎల్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక వనరులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే.రూ.5 వేల కోట్ల మేర విడుదల చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలోని ఇసుక, మాంగనీసు తదితర గనుల లీజును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు

1177వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారానికి 1177వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు గాజువాక జోన్ కార్యదర్శి లోకేష్, సభ్యులు కె.మాలకొండయ్య, పి.నూకరాజు పాల్గొన్నారు.

టమాటా ధరలు తగ్గించే చర్యలు చేపట్టండి

చర్చించారు. అధిక వేడి, వర్షాలు కారణంగా టమాటా ఉత్పత్తి గణనీయంగా తగ్గడం వల్ల ధర అధికంగా ఉందని అధికారులు వివరించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ జిల్లాకు కేటాయించిన రివాల్వింగ్ ఫండ్‌తో మార్కెట్ ఇంటర్వెర్షన్ ద్వారా టమాటా తక్కువ ధరకు లభ్యమయ్యే చోటగానీ, స్థానిక కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ వద్దగానీ, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి కొనుగోలు చేసిగానీ రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు లాభం, నష్టం లేని విధంగా అందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

శోభాయమానం..
శ్రీ వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు ఏరియాలోని శ్రీ శృంగమణి పర్వతంపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం శోభాయమానంగా జరిగింది. నాలుగు గంటల సమయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారిని పల్లకిలో వేంచేయించి ఊరేగింపుగా మెట్ల మార్గం గుండా కిందకు తీసుకువచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు పల్లకిలో వేంచేయగా వేద పండితులు, అర్చక స్వాములు ఎదురు సన్నాహం, కొట్నాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. పూలతో నేత్రపర్వంగా అలంకరించిన లాంచీలో స్వామి వారిని వేంచేయించారు. పోర్టు సమకూర్చిన లాంచీలు స్వామి వారు విహరించిన లాంచీని అనుసరించాయి. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఉత్సవాన్ని పర్యవేక్షించారు.



సముద్రంలో సాగుతున్న వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

పారా అథ్లెటిక్స్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం వేదికగా పోలీస్ బేరక్స్ గ్రౌండ్‌లో ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న ఐదో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి పారా క్రీడాకారులు హాజరై వారి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. పోటీలలో పాల్గొనే పారా క్రీడాకారులు 7013569514, 9390131777 నెంబర్లను సంప్రదించి వెంటనే వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కో - ఆర్డినేటర్ వై.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, ప్రతినిధులు బి.గణేష్, టి.ఉదయ్, హుస్సేన్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 30 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఆయన కార్యాలయంలో నగర పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. 30 వినతులు వచ్చాయి. ఇంక్రిమెంట్ రావడంలో జాప్యం, డిప్యూటేషన్లు, ఆరోగ్య సమస్యలు, ఉద్యోగోన్నతులు తదితరాలకు సంబంధించిన వి అందులో ఉన్నాయి. త్వరలోనే ఆ సమస్యలను పరిష్కరిస్తామని సిపి తెలిపారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నీట్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు మాట్లాడారు. ఎన్‌టిఎ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలు కలిగిస్తోందని అన్నారు. పరీక్షను సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి: యు.నాగరాజు, నాయకులు రవి సాయి, ప్రవీణ్ సాయి, కృష్ణ, హేమానంద్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన 3 బస్సులు,14 స్కూలు ఆటోలపై కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న 3 స్కూలు బస్సులుపైనా, 14 స్కూలు ఆటోలపైనా శుక్రవారం కేసులు నమోదు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి రాజారత్నం మీడియాకు తెలిపారు. ఈ నెల 13 నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఆ రోజు నుంచి ఈ రోజు వరకు నిబంధనలు ఉల్లంఘించిన 30 స్కూలు, కాలేజీ బస్సులపై కేసులు నమోదు చేశామని, ఒక బస్సును సీజ్ చేశామని వెల్లడించారు. అలాగే 16 స్కూలు ఆటోలపై కేసులు నమోదు చేశామని, ఒక ఆటోను సీజ్ చేశామని తెలిపారు. శుక్రవారం గంభీరం, వేపగుంట, మద్దిలపాలెం, అడవివరం ప్రాంతాలలో తనిఖీలు జరిగాయని, ఆ కార్యక్రమాల్లో తనిఖీ అధికారులు కె.ప్రవీణ్ కుమార్, మన్మోహన్, మాధవి, సత్యంనాయుడు పాల్గొన్నారని తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM O.S.1457/2021

Between:
Smt. Cheekati Pavani Lakshmi ...Plaintiff
And:
Smt. Seerapu Jaya Lakshmi & 3 others ...Defendants

SUMMONS

To,
D-1: Smt. Seerapu Jaya Lakshmi, W/o. Seerapu Mohana Rao Reddy (late), Hindu, aged about 57 years, R/at D.No.31-48-15/6, Flat No. 201, 3rd Floor, Sunrise City, Mithra Block, Fakirtakiya, Auto Nagar, Visakhapatnam-46.
D-2: Seerapu Roopa Lavanya, D/o. Seerapu Mohana Rao Reddy (late), Hindu, aged about 36 years, Rest-do-.
D-3: Seerapu Renuka Lavanya, D/o. Seerapu Mohana Rao Reddy (late), Hindu, aged about 34 years, Rest-do-
D-4: Seerapu Sirisha Lavanya, D/o. Seerapu Mohana Rao Reddy (late), Hindu, aged about 32 years, Rest-do-.

Please take notice that the above named plaintiff has instituted the above suit against all of you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **05-07-2024** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-07-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)

P. SRIDHAR MANIKANTA, Advocate
Visakhapatnam, Cell: 7794034264.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కుప్పిలి శంకరర్రావు, తండ్రి సంగం, నర్సీపట్నం మున్సిపాలిటీ ఉద్యోగి, నర్సీపట్నం వారు నాకు యిచ్చిన భోగట్టా పైని యీ ప్రకటన జారీ చేయడమైనది.

నా క్లయింటున్ను బొబ్బిలి గ్రామస్థులు కుప్పిలి శాంతమ్మ, భర్త సంగం వారు నా క్లయింటు కన్నతల్లిదండ్రుల మారోజు చిన్నయ్య, గోపాలమ్మ అనుమతితో 1986 సం॥లో కూలాచర ప్రకారం దత్తత చేసుకొని యున్నారు. అప్పటి నుండి నా క్లయింటు కుప్పిలి శాంతమ్మగారి కుమారుడుగా అనగా కుప్పిలి శంకరరావు, తండ్రి సంగంగా అన్ని రికార్డులలోను నమోదు చేసుకొని జీవించుచున్నాడు. దరిమిలా నా క్లయింటు దత్తతల్లి మరియు నా కన్న తల్లిదండ్రుల కలిసి తే: 1-10-1991దిన రిజిష్టర్డు దత్తత స్వీకారపత్రం వ్రాసుకొని (డి.సి.నెం. 26/91) రిజిష్టరు చేసియున్నారు. దరిమిలా నా క్లయింటు తల్లిగారు కుప్పిలి శాంతమ్మ తే: 14-6-1996దిన ఇన్‌టేస్టేట్‌గా కాలం చేయగా, వారి పనిచేసిన బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంనందు, కారుణ్య నియామకం క్రింద (ఆర్.సి.429/1997/ఎ2) ప్రకారం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం యిచ్చి యున్నారు. అప్పటి నుండి నా క్లయింటు మున్సిపల్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ, ప్రస్తుతం నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయం ఉద్యోగం చేయుచున్నాడు.

కాగా నా క్లయింటు యొక్క దత్తత మరియు అతని పుట్టు పూర్వోత్రము గురించి అతను కార్యాలయమునకు లేనిపోని తప్పుడు పిటిషన్లు పెడుతూ థర్ట్‌పార్టీలు వారు యిబ్బందులకు గురిచేస్తున్నారు. కాబట్టి, నా క్లయింటును చట్టప్రకారం, కులాబార ప్రకారం పైన విధంగా కుప్పిలి శాంతమ్మ, భర్త సంగం, బొబ్బిలి గ్రామస్తురాలు దత్తత తీసుకొని, పెంచి పెద్ద చేసినందున నా క్లయింటు కుప్పిల శంకరరావుగా అన్ని రికార్డులలో నమోదు అయివున్నందున నా క్లయింటు ఆమె దత్తత కుమారుడుగా గుర్తించడమైనది. కావున సదరు విషయమై ఎవరు ఎటువంటి ఆక్షేపణలు చేయరాదని యీ నోటీసు ద్వారా హెచ్చరించడమైనది.

పొక్కునూరి నాగేశ్వరరావు
న్యాయవాది,
పాతమున్సిపల్ ఆఫీసు వెనుక
నర్సీపట్నం-531116
అనకాపల్లి జిల్లా.

నర్సీపట్నం
తే: 21-6-24

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM I.P. 24/2024

Between:
Gunupuru Hemanth, S/o. G. Suryanarayana, Hindu, Aged about 35 years, Flat No.301, Durga Nagar, Chandram Palem, Visakhapatnam Dist. . . . Petitioner
And:
Mudadla Satyanarayana & 9 others ...Respondents

To,
R-1:**Mudadla Satyanarayana**, S/o.Sanyasi Naidu, aged about 30 years, D.No.13-7-941,Kandhi Veedhi, Gajarayunivalasa Village, Badangi Mandalam, Vizianagaram Dist-535578.
R-2:**Punnepalli Harikrishna,** S/o. Srinivasulu, aged about 34 years, D.No.1-14-123, New water tank, Govt Degree College, Ulavapadu Village & Mandal, S.P.S.R.Nellore District-523292.
R-3:**Garlapati Thirupathiah,** S/o. Srinivasarao, Hindu, aged about 31 years, Business, D.No.13-4-64/4,Ward No.8, Srinivasa Nagar, Narasaraopet town, Mandal and Palnadu District-522 601.
R-4:**Kethavath Narasimha Raju**, S/o. Damodhar, aged about 46 years, Business, D.No.13-5-18, 3rd lane, Islampeta, Narasaraopet Town & Mandal, Palnadu District-522 601.
R-5:**Shaik Khaja,** S/o. Meera Jilani, Muslim, aged about 35 years, Business, R/o. H.No.13-4-61/a, Narasaraopet Town & Mandal JCJC, Palnadu District-522601.
R-6:**Dasari Siva Nagaraju,** S/o. Anjaneyulu, Hindu, aged about 49 years, D.No.33-3-354, Business, Srinivasanagar, Narasaraopet Town & Mandal, Palnadu District-522601.
R-7:**Ratti Hemakumar,** S/o. Srinivasulu, aged about 36 years, D.No.12/2/147, Opp: Town Hall Street, Mandasa, Srikakulam Dist-532242.
R-8:**Cheekati Ravi Kumar,** S/o. Subbarao, Hindu, aged about 33 years, Business, D.No.34-342-5/a, Postal Colony, Near NGO Colony, Narasaraopet town and Mandal JCJC, Palnadu Dist-522601.
R-9:**Kakumani Bhanumurthy,** S/o. Krishnamurthy, Hindu, aged about 38 years, Business, D.No.3-342-2/h, KHBP Colony, Hyderabad Town & Mandal, Rangareddy District-522 601.
R-10:**Gogineni Nagaraju,** S/o. Srinivasarao, Aged about 42 years, Hindu, D.No.4-52-11/d, Syamala agar 11th line, Guntur Town & Mandal, Guntur Dist.

GENERAL NOTICE

The public are hereby informed that the above named petitioner filed the above I.P.No.24/2024 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court, at Visakhapatnam to declare him as an insolvent and the matter stands posted to **08-07-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **08-07-2024** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)

K.A.R @ APPAJI, Advocate
New Gajuwaka, Visakhapatnam,
Cell: 8500096304

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం!

- అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
- విద్యుత్ లైన్ల ఎత్తు, సామర్థ్యం పెంపు
- డిమాండ్‌కు తగ్గ కరెంట్ సరఫరాకు చర్యలు



చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రజాశక్తి -తగరపువలస: ఎటువంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ విభాగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ఇప్పటివరకు ఉన్న లైన్లను బాగుచేయడం, అదనపు సబ్‌స్టేషన్లు ఏర్పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సామర్థ్యం పెంచడం, మరిన్ని సౌకర్యాలను సమకూర్చడం వంటి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోనూ అనేక అదనపు సౌకర్యాలను సమకూరుస్తున్నారు.

మండలంలోని చిట్టివలసలోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 2023-24లో ఉన్న సుమారు వంద ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా రూ.కోటి వ్యయంతో మరో 40 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇంకా రూ.47 లక్షలతో ప్రస్తుతం ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచుతూ 15 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఎనిమిది ఫీడర్ల ద్వారా సుమారు 10 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ సరఫరా జరుగుతోంది. అర్బన్‌లో (తగరపువలస) 60 నుంచి 70వరకు, చిట్టివలస పరిధిలో 70 నుంచి 80 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. రూరల్ పరిధిలో 30 నుంచి 40 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. సంగివలస ఎన్నారై ఆసుపత్రిరోడ్డులో 8,9 మీటర్ల ఎత్తులో విద్యుత్ స్తంభాలు స్థానంలో 11 మీటర్ల ఎత్తులో కొత్తవి 12 స్తంభాలు వేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు

త్వరలో మరో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు

చిట్టివలస సబ్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే పది మెగా వాట్ల సామర్థ్యం గల విద్యుత్ సరఫరా జరుగుతుండగా, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఇప్పటికే మంజూరైన 5 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నారు.స్థల సమస్యతో దీని ఏర్పాటు జాప్యం జరుగుతున్నప్పటికీ, త్వరలో దాన్ని అధిగమించి, ఏర్పాటు చర్యలు చేపడతామని సంబంధిత అధికారులు అంటున్నారు. తద్వారా పట్టణ పరిధిలో చిన్నపాటి సమస్య కూడా లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుందని అంటున్నారు.

దాదాపు 13,500కనెక్షన్లకు విద్యుత్

చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 10 వేల గృహ విద్యుత్ కనెక్షన్లు, మరో 3,500 వరకు దుకాణాలు,ఆసుపత్రులు తదితరాలు వంటి వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.నానాటికి పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని, సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపుతోపాటు, విద్యుత్ లైన్లను మెరుగుపరచడం వంటిచర్యలు చేపడుతున్నట్లు అధికారులు అంటున్నారు. కాగా భీమిలి మండలం తాళ్ళవలసలో ఉన్న మరో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా తాళ్ళ వలస, వలందపేట తదితర ప్రాంతాల్లో 5వేల వరకు గృహ విద్యుత్ కనెక్షన్లుకు విద్యుత్ సరఫరా అవుతుంది.

సామర్థ్యాన్ని మించి వినియోగమైతే సాంకేతిక సమస్యలు

పట్టణ పరిధిలో 200 యాంప్స్, రూరల్‌లో 120 యాంప్స్ విద్యుత్ సరఫరా సామర్థ్యం దాటితే అనివార్యంగా ఫీడర్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రిప్ అవుతుంటుందని, ఆ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్‌ఏర్పాటుతో సమస్యలకు చెక్ చెప్పవచ్చని అంటున్నారు. ఇప్పటికే ఒకటో వార్డులో ఏర్పాటుకు మంజూరై, స్థలసమస్యతో జాప్యం జరుగుతున్న 5 మెగావాట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యంతో కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటైతే ఈ సమస్యలన్నింటికీ చెక్ పడనుందని అధికారులు అంటున్నారు.

జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి



జగన్‌తో ముత్తంశెట్టి, శివనందీష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని భీమిలి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు వైసిపి ఉమ్మడి విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ముత్తంశెట్టి శివనందీష్ శుక్రవారం కలిశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి, పలు విషయాలపై మాట్లాడారు.

సచివాలయంలో చంద్రబాబు, పవన్ ఫోటోల ఏర్పాటు



ఫొటోలను ఏర్పాటు చేస్తున్న సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు

ప్రజాశక్తి-ఆనందపురం : భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫోటోలను ఏరాపటు చేయడంపై కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించడం, ముఖ్యమంత్రిగాచంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలను విధిగా ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతోపాటు ఈమేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే గంభీరం సచివాలయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ, ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి పార్టీలకు చారిత్రక విజయాన్ని ప్రజలు కట్టబెట్టారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంభీరం పంచాయతీ మాజీ సర్పంచ్ వానపల్లి ముత్యాలరావు, ఉప సర్పంచ్ బొట్ట శ్రీను, దల్లి రాంబాబు, అప్పల గురువు, ధర్మవతి, చల్లా సుబ్బు, చెల్లి పోయిన సురేష్, అడ్డూరి సురేష్, తెడ్లాపు నర్సింగరావు, టిడివి, జనసేన, బిజెపి నాయకులు. కార్యకర్తలు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

కూరగాయల ధరలకు రెక్కలు

ఘాటెక్కిన ఉల్లి : సెంచరీ కొట్టి దారెత్తిస్తున్న టమాటా



మార్కెట్ లో విక్రయిస్తున్న కూరగాయలు

ప్రజాశక్తి -నక్కపల్లి:కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో ఏమి కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు..అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితి ఉంది. గత రెండు, మూడు వారాల నుంచి కూరగాయల ధరలు అమాంతంగా పెరిగి పోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మార్కెట్లో అన్ని కూరగాయల ధరలు పైపైకి చేరాయి.

సామాన్యుడికి అందుబాటులో ఉండే ఉల్లి ఇప్పుడు ఘాట్టెక్కింది. టమోటా దారేకిస్తుంది. రెండు వారాల క్రితం కిలో రూ.20 లకు లభించే ఉల్లి, ప్రస్తుతం కిలో రూ.40 లకు చేరింది. కిలో రూ.20 నుండి రూ.30 లకు లభించే టమోటా నేడు రూ.100లకు పాకింది. దీంతో, టమోటా కొనాలంటే వినియోగదారులు హడలి పోతున్నారు. క్యారెట్ కిలో గతవారం రూ.40లు ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.60, బీట్‌రూట్ కిలో రూ.60, బెండ కిలో రూ.60, బీర కిలో రూ.80, బంగాళాదుంపలు కిలో రూ.50, దొండ కిలో రూ. 40, వంకాయలు కిలో రూ.60, క్యాబేజీ కిలో రూ.50, మిర్చి కిలో రూ.80, అల్లం కిలో రూ.200 ధరలు ఉన్నాయి. టమోటా, బీరకాయలు, బెండ, క్యారెట్ ధరలు అధికంగా ఉండటంతో వాటిని కొనేందుకు ప్రజలు ముందుకు రాలేదు. మార్కెట్‌లో ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ. 50 లు నుంచి రూ.60 పై మాటే. ధరలు ఆకాశాన్న ంటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూరగా యలు కొనేందుకు భయపడుతున్నారు.కూరగాయల ధరలు పైపైకి చేరడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అర, పావు కేజీ చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ధరలు మండిపోవడంతో తక్కువ తక్కువగా కూరగాయలు కొనుగోలు చేసినప్పటికీ రూ .300 ల నుండి రూ.400 లు ఖర్చు అవుతుందని, అయినప్పటికీ వారం సరి పోలేదని వినియోగదారులు వాపోతున్నారు. వేసవి కావడంతో కూరగాయలు దిగుబడి బాగా తగ్గడంతో కూరగాయల ధరలకు అడ్డూ అదుపు లేకుండా పెరిగాయి. వర్షాలు పడి కూరగాయలు సమృద్ధిగా చేతికందినప్పుడే ధరలు తగ్గే అవకాశం ఉంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం చెందిన ఘటన చిన్నగంట్యాడ కూడలి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గురునాథరావు కాలనీకి చెందిన సనపల తరుణ్ (10) తన తండ్రితో ద్విచక్ర వాహనంపై పాత గాజువాక నుండి శ్రీనగర్ వెళ్తుండగా, చినగంట్యాడ జంక్షన్ వద్ద, వెనుక నుండి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన తరుణ్ తలకు బలమైన గాయం కావడంతో మృత్యువాత పడ్డాడు. దీనిపై గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కారు షెడ్ వద్ద ఒక అపార్ట్‌మెంట్‌లో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు నేర విభాగం సీఐ జి.రాంబాబు తెలిపారు. వివరాలవి.

పోతిన మల్లయ్య పాలెం కార్ షెడ్ సమీపంలో శ్రీత మందారా నిలయం అపార్ట్‌మెంట్ నాలుగవ అంతస్తు, ఎఫ్ 3లో ఎస్. శశిభూషణరావు అనే వైద్యదంపతులు ఉంటున్నారు. వీరిద్దరూ విజయనగరంలో విధులు నిర్వహిస్తూ, అక్కడే నివాసం వుంటున్నారు. శుక్రవారం ఉదయం వారు ఉంటున్న ఫ్లాట్ తాళాలు పగిలి ఉన్నాయని అందిన సమాచారంతో వచ్చి పరిశీలించగా, ఫ్లాట్‌లోని ఏడు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయడంతోపాటు ఫింగర్ ప్రింట్స్ ఇతర ఆధారాలను సేకరించారు. డాక్టర్ శశిభూషణ్ ఫిర్యాదు మేరకు నేర విభాగపు ఎస్ఐ రంభ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాలు, బ్యాగులు, బెల్ట్‌ల పంపిణీ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడవ వార్డు చంద్రంపాలెం ఎన్‌జిఒ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్ట్‌లను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పిల్లా మంగమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పిళ్లా వెంకటరావు, జనసేన వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహ నాయుడు, పాఠశాల హెచ్‌ఎం సుహాసిని, కానూరి అచ్యుతరావు, పోతిన నాయుడు, పోతిన బాలాజీ, పిల్లా రాము, పిళ్లా మోహన్‌కృష్ణ, పిళ్లా శ్రీను, జగుపల్లి నాని, కామేష్, పోతిన బుజ్జి, దుర్గశి రాము పాల్గొన్నారు.

విఆర్‌ఎల మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం గ్రామ సేవకులు (విఆర్ఎ) సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. విఆర్‌ఎల మండల కమిటీ అధ్యక్షునిగా మామిడిలోవ గ్రామ పంచాయతీ విఆర్ఎ డెంకాడ ముత్యాలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు ఉపాధ్యక్షులుగా ఈది రాము, కార్యదర్శిగా ఉప్పాడ చిన్నారావు, సలహాదారు బోని అప్పలస్వామితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు కొత్తగా ఏర్పాటైన మండల కమిటీ వివరాలను స్థానిక తహశీల్దార్ హేమంత్‌కుమార్‌కు అందజేశారు. విఆర్‌ఎల సంఘం అధ్యక్షుడు ముత్యాలుతోపాటు, ఇతర కార్యవర్గాన్ని పలువురు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మత్తు జోలికి పోవద్దు

ప్రజాశక్తి-భీమునిపట్నం : గంజాయి, హెరైన్, కోకైన్ వంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, వాటి వాడకం వల్ల జీవితం సర్వనాశనమౌతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు అన్నారు. శుక్రవారం జివిఎంసి నాలుగోవార్డు మంగమారిపేట జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, వాటిని కలిగి ఉండడం వల్ల చట్టపరంగా ఇబ్బందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ చిన్నంనాయుడు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ ఎస్ఐ చిన్నంనాయుడు

అయోధ్యనగర్ రోడ్డు బాగుచేయరూ..!

- గోతుల మట్టిరోడ్డులో రాకపోకలకు కష్టాలు
- చినుకురాలితే అడుగు ముందుకేయడం గగనమే
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని వైనం



అయోధ్యనగర్ మట్టిరోడ్డు ఇదే

ప్రజాశక్తి -మధురవాడ: జివిఎంసి ఐదో వార్డులో అయోధ్యనగర్ కాలనీ ఏర్పడి సుమారు మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటివరకు ప్రధాన రహదారి నిర్మించక పోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ నిర్మాణ సమయంలో వేసిన మట్టి రోడ్డు నేటికీ ఉండగా, వాటి నిర్వహణ, పటిష్ట పరిచే దిక్కు లేకపోవడంతో గోతులమయమై నేటికీ అధ్వానంగానే దర్శనమిస్తున్నాయి. నిత్యం ఈ మార్గంలో కాలనీవాసులతో పాటు వందలాది మంది కారినడకన, బైక్‌లు, ఇతరత్రా వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. నిండా గోతులమయమై, మట్టిరోడ్డులో వచ్చిపోయేందుకు వీరంతా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇక మామూలు రోజుల్లో పరిస్థితులు ఇలా ఉంటే, వర్షాల సీజన్‌లో ఈ మార్గంలో రాకపోకలకు పాద చారులు, వాహనదారులు పడే కష్టాలు చెప్పనలవి కాదు. ఈ నేపథ్యంలో అయోధ్యనగర్ కాలనీ రోడ్డుపై దృష్టి పెట్టి, దీన్ని పటిష్టపరిచే చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, అయోధ్య నగర్ ప్రధాన రహదారిని సిమెంట్ కాంక్రీట్ లేదా బిటి రోడ్డుగా పటిష్టపరిచి, ప్రజలు, వాహనదారుల రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని కాలనీవాసులు మొరపెట్టుకుం టున్నారు.

మంత్రి నారాయణకు అభినందన



మున్సిపల్ మంత్రిని అభినందిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారాయణను రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు కలిసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో రెండోసారి మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ పదవీబాధ్యతలు స్వీకరించడంపై హర్షం వ్యక్తం చేసిన అసోసియేషన్ ప్రతినిధులు, మున్సిపల్ మంత్రి నారాయణ సారథ్యంలో రాష్ట్ర టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పట్టణీకరణ సుందరీకరణకు మరింత ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేస్తామని మాటిచ్చారు. ఇదే సమయంలో తమ విభాగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి నారాయణను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారని వెంకటేశ్వరరావు తెలిపారు.

అబ్బురపరచిన పెద్ద నత్త



స్కేటింగ్ అకాడమిలో దర్శనమిచ్చిన పెద్ద నత్త

ప్రజాశక్తి- పిఎం పాలెం : పిఎం పాలెం స్టేడియం సమీపంలో ఉన్న కళ్యాణ్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో శుక్రవారం పెద్ద నత్త దర్శనమిచ్చింది. రుదుగా కనిపించే ఇటువంటి నత్త ను ఎక్కువ శాతం ఇతర దేశాలలో లేక టీవీలలో, వీడియోలు, వార్తల్లో చూసిన వారంతా ఇపుడు ప్రత్యక్షంగా కనిపించడంతో ఔరా అంటూ ఆశ్చర్యపోయారు. రెండు రోజులుగా వర్షాలు కురవడంతో సమీప కొండ ప్రాంతం నుంచి ఇది వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. దీనిని చూసేందుకు స్థానికులు, అక్కడ స్కేటింగ్‌కు వచ్చే పిల్లలు, వారి తల్లిదండ్రులు ఎగబడ్డారు. దాదాపు పెద్దవారి అరచెయ్యంత పెద్ద సైజులో, దాదాపు కిలో బరువుండే నత్తను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గిరిదీప్‌సింగ్

ప్రజాశక్తి-ములగాడ: హిందుస్థాన్ షిప్‌యార్డును నిర్మించిన వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహాన్ని సింధియా ప్రధాన జంక్షన్ వద్ద శుక్రవారం ఆ సంస్థ డైరెక్టర్ (స్ట్రాటజిక్ ప్రాజెక్టు) గిరిదీప్ సింగ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికే గర్వకారణం, తలమానికంగా ఉన్న హిందుస్థాన్ షిప్‌యార్డును ఏర్పాటు చేసిన వాల్‌చంద్ హీరాచంద్ చిరస్మరణీయుడని, ఈ సంస్థపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. అటువంటి మహనీయులు విగ్రహాన్ని స్థాపించటం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, జిఎంలు, కార్మికులు పాల్గొన్నారు.

సాగు, సస్యరక్షణపై అవగాహన



జికెఎంఎస్ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జగన్నాథరావు

ప్రజాశక్తి- ఆనందపురం:గ్రామీణ కృషి, మౌసమ్ సేవా పథకం(జికెఎంఎస్) కింద సాగు, సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాథరావు పాల్గొని, వాతావరణ సూచనలు, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలపై వివరించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలంతా బృందంగా సలహాలను క్రోడీకరించి, రైతులు, ప్రజలకు వాతావరణ సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు. జికెఎంఎస్ నోడల్ ఆఫీసర్, సేద్యశాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి గౌరి ఈపథకం ప్రత్యేకతలను వివరించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం హార్టీకల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ సత్తిబాబు ఉద్యానవన పంటల సాగు, సస్యరక్షణపై రైతులకు వివరించారు సీనియర్ శాస్త్రవేత్త (తెగుళ్ళ విభాగం) డాక్టర్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, పంటలను ఆశించే తెగుళ్ళు, చీడపీడలు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ డి.అనిల్‌కుమార్ వరి, కాయగూరల పంటలను ఆశించే పురుగులు, వాటి నివారణ చర్యలపై వివరించడంతోపాటు రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె అప్పలస్వామి, సూక్ష్మ బిందుసేద్యం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.మన్మథరావు, జిల్లా శిక్షణ కేంద్రం ఎడిఎ చదువుల సుబ్రహ్మణ్యం, ఏడిఏ విజయకుమార్, మండల వ్యవసాయాధికారి సిహెచ్ సంధ్యరత్నప్రభ, ఆర్ఎజికెఎంఎస్ ఎ.అలివేణి, ఎఇ సురేష్, వ్యవసాయ సహాయకుల రమేష్, గౌస్,వినూత్న, దిలీప్, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండల రైతులు పాల్గొన్నారు.

జూలోని జిరాఫీని దత్తత తీసుకున్న ఫ్లూయింట్



జిరాఫీని దత్తత తీసుకున్న ఫ్లూయింట్ గ్రిడ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ :ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో శుక్రవారం అంతర్జాతీయ జిరాఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూపార్కులో ఉన్న రెండు జిరాఫీలలో ఒక దానిని ఫ్లూయింట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ ఏడాది పాటు దత్తత తీసుకుంది. దీనికి గాను జిరాఫీ నిర్వహణకు ఏడాదికి అయ్యే ఖర్చు రూ 1.80లక్షలను ఫ్లూయింట్ గ్రిడ్ లిమిటెడ్ భరించనుంది. ఈ సందర్భంగా ఫ్లూయింట్ గ్రిడ్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ రవికాంత్ మాట్లాడుతూ జంతు దత్తత కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జూక్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ జంతు దత్తత తీసుకునే వారికి ఆదాయ పన్ను నుంచి 50 శాతం మినహాయింపు ఉంటుందన్నారు.

జిరాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జూ అధికారులు గోపాలనాయుడు, గోపి, భారతి, జూ ఎడ్యుకేషన్ బృందం పాల్గొంది.

నేడు సోమశేఖర్ సంతాపసభ



పాఠశాల ప్రారంభోత్సవంలో సోమశేఖర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- విశాఖపట్నం : కంచరపాలెం హైవేను ఆనుకుని ఉన్న గిరీష శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు, అక్షర ఫౌండేషన్ ఛైర్మన్ జోగి సోమశేఖర్ సంతాపసభ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఈనెల 22న మురళీనగర్‌లో జరుగుతుందని పాఠశాల హెచ్ఎం అనురాధ తెలిపారు. ఈనెల 22న సోమశేఖర్ తనయుడు నవీన్‌చైతన్య ఆధ్వర్యంలో మురళీనగర్‌లోనూ, 30న ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోనూ సోమశేఖర్ సంతాప సభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

శుక్రవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ, 1999లో కంచరపాలెం హైవే పక్కన గిరీష శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించిన జోగి సోమశేఖర్ ఈనెల 12న బుధవారం హఠాన్మరణం పొందడం విస్మయానికి గురిచేసిందన్నారు. పాఠశాల కరస్పాండెంట్‌గా, అక్షర ఫౌండేషన్ ఛైర్మన్‌గా, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సోమశేఖర్ చేసిన సేవా కార్యక్రమాలు ఎనలేనివన్నారు తమ పాఠశాల విద్యార్థులు విద్య, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెంది దేశవిదేశాల్లో ఉన్నతస్థానాల్లో స్థిరపడ్డారంటే సోమశేఖర్ కృషి ఎంతో ఉందన్నారు. పేద విద్యార్థులకు విద్యతోపాటు ఆర్థికంగా తోడ్పాటునందించడం, తల్లిదండ్రులు, పెద్దలు, సమాజం పట్ల ఎలా మెలగాలో నేర్పించడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించే వారన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల ఆదరాభిమానాలు చూరగొనడంలో సోమశేఖర్ మాస్టారు కృషి, చొరవ మరువలేనిదన్నారు. అనారోగ్యరీత్యా ఆయన మరణం వారి కుటుంబానికే కాకుండా విద్యార్థిలోకానికి, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్‌కు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

వేతన బకాయిలు చెల్లించకుంటే సమ్మె

పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మేజర్ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలలుగా బకాయి పడ్డ వేతనాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే సమ్మెలోకి వెళ్తామని బాధిత కార్మికులు హెచ్చరించారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కసింకోట పంచాయతీ వద్ద పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రామాజీ, జి.వెంకటరమణ, కోశాధికారి కె.దేవుడు, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఈ ఏడాది జనవరి నుండి వేతనాలు చెల్లించలేదని, ఇలా అయితే కార్మికుల కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుతున్నారని, అయినా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సామాజిక తరగతికి చెందిన పారిశుద్ధ్య కార్మికుల పట్ల ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి నెలా వేతనాలు అందకపోవడం వలన వడ్డీలకు అప్పులు తెచ్చి, వాటిని తీర్చలేక కుటుంబాన్ని పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కరోనా తర్వాత ఇప్పటివరకు చేతి గ్లౌజులు, నూనెలు, సబ్బులు, యూనిఫారాలు, పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వానికి తమ సమస్యను విన్నవించి ఇప్పటివరకు రావలసిన ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓ.అప్పారావు డి.సూర్య అప్పారావు, ఈ.అర్జునమ్మ, ఈ.ఆదిలక్ష్మి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



ఎస్‌పి మురళీకృష్ణకు తమ సమస్యలు చెప్పుకుంటున్న పోలీసు సిబ్బంది

'పోలీస్ గ్రీవెన్స్'కు 15 వినతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 15 మంది పోలీసు సిబ్బంది, తమ అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి విన్నపాలను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.



మామిడివాక గెడ్డలో ఏపుగా పెరిగిన జమ్ము గడ్డి

మామిడివాక గెడ్డలో జమ్ము గడ్డి తొలగించరూ...

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం తాళ్ళపాలెం సంత వద్ద గల మామిడివాక గెడ్డలో ఏపుగా పెరిగిన జమ్ము గడ్డిని తొలగించాలని గెడ్డ దిగువన గల ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఎగువ ప్రాంతం నుండి వర్షపు నీరు ఈ గెడ్డ నీరు దిగువకు ప్రవహిస్తుంది. నర్సాపురం బేరేజ్, శారదా నదితో పాటు మామిడివాక గెడ్డలో నీరు స్టోరేజు అవుతుంది. దీని ద్వారా మండలంలోని తాళ్ళపాలెం, గొబ్బూరు, ఎ.ఎస్.పేట, సోమవారం, చింతలపాలెం, ఏనుగుతుని తదితర గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు అందుతోంది. చెరకు, వరి పంటలకు ప్రధాన ఆధారంగా ఉంది. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో గెడ్డ నిండా జమ్ముగడ్డి పేరుకుపోవడంతో నీరు పారడానికి ఆటంకం కలుగుతుంది. గొబ్బూరు ఛానల్ వద్ద జమ్ము గడ్డ పెద్దమొత్తంలో ఉండడంతో నీరు ప్రవహించక వివిధ కాలువలకు నీరు అందని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దీనిపై దృష్టిసారించి గెడ్డలో పేరుకుపోయిన జమ్ము గడ్డిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీలు



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-కె.కోటపాడు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పన్నులపై సామాజిక తనిఖీలు పారదర్శకంగా, జవాబుదారీ తనంగా నిర్వహించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ డి.రాజేంద్ర అన్నారు. మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, వేతన రూపంలో రూ.13.73 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.13.92 కోట్లు ఖర్చు చేయగా, వాటికి సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీలపై శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ నిధుల ద్వారా పనులు చేపట్టిన వెటర్నరీ, ఆర్‌డబ్ల్యుయస్, పిఆర్, ఫారెస్టు, పెన్షన్లపై సామాజిక తనిఖీ గ్రామాల వారీగా చేయనున్నారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ డి.రాజేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 9 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు, మండల పంచాయతీ అధికారి ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ బాలాజీ, వెటర్నరీ డాక్టర్, అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెన్సులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు. సామాజిక తనిఖీ పారదర్శకంగా, ప్రజలకు ఉపాధి కూలీలకు జవాబుదారీగా నిర్వహించడానికి అందరు సహకరించాలని ఆయన కోరారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తిమిరాం రెవెన్యూ పరిధిలో చెరువుల ఆక్రమణలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తహశీల్దారు జి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ పరిధిలో శిలవాని చెరువు, సీతవాణి చెరువు, కుమ్మరి గాత చెరువు, ఎర్ర పనుకుబంధ చెరువు, అడవి చెరువు, కోణంబంధచెరువు తదితర చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని టిడిపి గ్రామ నాయకుడు రెడ్డి అప్పలనాయుడు ఇటీవల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ చెరువుల విస్తీర్ణంపై సర్వే చేసేందుకు ఇప్పటికే ఆర్ఐ, సర్వేయర్లను పంపించినట్లు తహశీల్దార్ తెలిపారు. వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



మంత్రి రామానాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న చిటిమిరెడ్డి

మంత్రి నిమ్మలకు చిటిమిరెడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రైవాడ జలాశయం అభివృద్ధికి అన్ని విధాల సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో రైవాడ జలాశయం పూర్తిగా నిర్వీర్యమైందని, ఈ ప్రాంత రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు సూర్యనారాయణ స్థానిక విలేకరులకు తెలిపారు. అలాగే రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు కూడా సూర్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పెంచాలని వినతి

ప్రజాశక్తి- కశింకోట

జివిఎంసి పరిధి పరవాడ మండలంలోని లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, అగనంపూడి తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పెంచాలని జివిఎంసి 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం కశింకోటలోని ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో ఈఈ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అగనంపూడి, లంకెలపాలెం, దేశపాత్రుని పాలెం ప్రాంతాల్లో హై వోల్టేజ్ వల్ల అధిక విద్యుత్ సరఫరా కావడంతో పలు గృహోపకరణాలు, మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. ఓల్టేజ్ సరిపడా సరఫరా అయ్యేలా ట్రాన్స్‌ఫార్మర్లను పెంచాలని కోరారు.



ఎపిఇపిడిసిఎల్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా స్థానిక శారద బ్రిడ్జి అన్నమయ్య పార్కులో ప్రముఖ వాగ్గేయకారులు అన్నమయ్య విగ్రహానికి సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత వీణా విద్వాంసులు తోలేటి బుచ్చిబాబు, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ అన్నమాచార్య జయంతి వేడుకలు, ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, దేగల రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్‌లో.....

అనకాపల్లి ఉడ్‌పేటలో ఉన్న కళ్యాణి అకాడమి ఆఫ్ ఆర్ట్స్‌లో ప్రపంచ సంగీత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అకాడమి వ్యవస్థాపకులు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ సంగీత పితామహులు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2002 జూన్ 21న ప్రపంచం సంగీత దినోత్సవం రోజున ప్రముఖ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సూచనలతో ఈ అకాడమిని ప్రారంభించామని చెప్పారు. ఈ సందర్భంగా అకాడమి విద్యార్థులు ఆలపించిన గీతాలు అందరిని ఆకట్టుకన్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమి ప్రిన్సిపాల్ నడిగట్ల వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాదిలో...

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జూనియర్ కాలేజీ, కస్తూరాబాయ్ గాంధీ బాలికల విద్యాలయంలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సంగీత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక సాయి నుండి సంగీత సాధన చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, లెక్చరర్లు సుధీర్, నరసింహమూర్తి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



అన్నమయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



సమావేశంలో పాల్గొన్న జనసేన, టిడిపి, బిజెపి నేతలు

ఎమ్మెల్యే విజయ్‌కుమార్ స్వాగతానికి తరలిరావాలి

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్

యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఈ నెల 23న నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఎన్‌డిఎ కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కూటమి నాయకులు బైలపూడి రామదాసు, రాజాన రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురం జనసేన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల వారీగా జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలను అధిక సంఖ్యలో తరలించడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కూటమి నాయకలు ధర్మిరెడ్డి నాయుడు, సన్యాసిరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో జనం అవస్థలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

భానుడి ప్రతాపానికి జనం విలవిలలాడుతున్నారు. ఎండవేడి, ఉక్కపోతతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ముందుగానే ప్రవేశించినా ఎక్కడా చినుకు రాలటం లేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వాతావరణం చల్లబడలేదు. రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఇళ్లలో నుంచి బయటకు వద్దామంటే నిప్పుల కుంపటిని తలపిస్తుంది. ఎండవేడి, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు రైతులు వరినారు మడులను దుక్కులు చేసుకుని విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఎప్పుడు వర్షాలు కురిస్తే అప్పుడు విత్తనాలు చల్లుకుందామని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సైకిల్‌పై అయోధ్యకు పయనం

ప్రజాశక్తి- వడ్డాది

బుచ్చయ్యపేట మండలం పొట్టి దొరపాలెం గ్రామానికి చెందిన కొలిమల్ల పెంటారావు సైకిల్‌పై అయోధ్యకు శుక్రవారం బయలుదేరాడు. పుట్టుకతోనే మూగ చెవిటి కలిగి ఉన్న ఈ యువకుడు వృత్తిరీత్యా బైక్ మెకానిక్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయోధ్యకు సైకిల్‌పై వెళ్లి శ్రీరాముడిని దర్శించుకోవాలని సంకల్పంతో ఉన్న పెంటారావు శుక్రవారం తన స్వగ్రామం పొట్టిదొరపాలెం నుండి సుమారు 2000 కిలోమీటర్ల మేర ఈ యాత్రకు బయలుదేరాడు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతలు ఎవరైనా ఆర్థికంగా సహకరించాలని, 9703210054 నెంబర్‌కు ఫోన్ పే ద్వారా సహాయం అందించాలని పెంటారావు కోరాడు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం

మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల అనర్థాలపై మండలంలోని గాలిభీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలను వినియోగించరాదని సూచించారు. మంచి సత్ప్రవర్తనతో చదువులపై దృష్టి సారించాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాల జోలికి పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలో ఉపాధి హామీ కూలీలకు నాలుగు వారాలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని కన్నూరు, మడకపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలకు వెళ్లి ఉపాధి హామీ కూలీలతో వారు సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని, తట్ట, పార, గుణపాం వంటి పనిముట్లుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు రోజు కూలి రూ.300 ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా ఎక్కడా అది అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.300 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600కు పెంచాలని, ఉపాధి హామీ పనులు గ్రామాల్లో నిర్వహించాలని, ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. పరవాడ మండలంలోని వెన్నెలపాలెం, పి.బోనంగి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించకపోవడం వల్ల కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత కోటేశ్వరరావు


'నేను బడికి పోతా'ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

బడి బయట పిల్లలను బడిలో చేర్పించడానికి ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, దిబ్బిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు అన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లల వివరాల జాబితాను తయారు చేసి వారిని బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దిబ్బిడి హైస్కూల్ పరిధిలో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బందితో శుక్రవారం దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యారావు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల బాలబాలికలు పాఠశాలలోనే ఉండాలన్నారు. గ్రామాల్లో అన్ని శాఖల వారితో కమిటీలు ఏర్పాటు చేయాలని, వచ్చే నెల 11వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ స్కూల్ హెచ్ఎమ్ రామకృష్ణ, సిఆర్పి గోలుకొండ శ్రీనివాసరావు, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నేతలు

ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

చోడవరం శాసనసభ్యులుగా శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన కెఎస్ఎన్ఎస్ రాజును శుక్రవారం రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు అమరావతి క్యాంప్ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

పంట కాలువ, గేట్లు పరిశీలన

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల, బగులవాడ, మార్టూరు, శంకరం, రేబాక తదితర గ్రామాల్లోని పంట పొలాలకు నీరు అందించే పంట కాలువను రైతు నాయకులు శుక్రవారం పరిశీలించారు. దిబ్బపాలెం సమీపంలో కాలవలో తుప్పలు, చాలా చెత్త పేరుకుపోయి ఉంది. గేట్లు కూడా చాలా వరకూ శిథిలావస్థలో ఉండి పనిచేయలేని పరిస్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు కాలువలను పునరుద్ధరించి గేట్లను మరమ్మతులు చేసి అన్నదాతలను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రెసిడెంట్ పీలా బుజ్జి, సెక్రటరీ పెతకంశెట్టి బలరాం, పీలా సీతారాం, కొణతాల నాగేశ్వరరావు, పీలా బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కలతో పేరుకుపోయిన కాలువను పరిశీలిస్తున్న రైతు నాయకులు

ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గోతులు

పూడ్చాలని వాహనదారుల వేడుకోలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి-చోడవరం ప్రధాన రహదారిలో తుమ్మపాల చిన్నబాబు కాలనీ వద్ద ఇటీవల వేసిన రోడ్డు శిథిలమై పెద్ద గొయ్యి ఏర్పడింది. ప్రతిరోజు వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, లారీలు, భారీ క్వారీ లారీలు, బస్సులు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డును కోట్లాది రూపాయలు వెచ్చించి గత ప్రభుత్వం వేసి ఏడాది కూడా పూర్తి కాలేదు. గత పదేళ్లలో ఈ రోడ్డును వేసేందుకు, మరమ్మతులు చేసేందుకు సుమారు ఆరేడు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. రోడ్డును వేసేటప్పుడే ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించి ఉండి ఉంటే రోడ్డు తరచూ మరమ్మతులకు గురయ్యేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలా చేయకుండా రోడ్డును వేయడం, దానిపై పరిమితికి మించిన క్వారీ రాయి లోడులతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉండడంతో వేసిన అతి తక్కువ కాలంలోనే రోడ్డు మరమ్మతులకు గురవుతోంది. చిన్నబాబు కాలనీ వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యి వల్ల రాత్రిపూట వాహనదారులు గోతులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక ఏమాత్రం వర్షం పడ్డ గొయ్యి వర్షపు నీటితో నిండి ప్రయాణికులకు రోడ్డుపై ఏముందో తెలియని పరిస్థితుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రజా సంఘాలు, స్థానికులు, వాహనదారులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నుంచే కలెక్టరేట్‌కు వెళ్లే బొజ్జన్న కొండ మార్గం కూడా ఉంది. అయినా ఆర్ అండ్ బి అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గాని స్పందించలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, ఈ రోడ్డుపై వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లింపు చేయాలని కోరుతున్నారు.



చిన్నబాబు కాలనీ వద్ద మెయిన్ రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి

డిఎంకె కాలేజీ ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని..

ఎస్ఎఫ్ఐ నేతల ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన నర్సీపట్నం డీఎంకే ఒకేషనల్ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ నేతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్ మాట్లాడుతూ, డీఎంకే కళాశాలలో చదువుతున్న సెకండియర్ విద్యార్థినిపై ఆ కళాశాల ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ప్రిన్సిపల్ ఈ విధంగా చేస్తే మిగతా వారంతా ఏమి నేర్చుకుంటారని ప్రశ్నించారు. ప్రిన్సిపల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు అర్జున్, భూషణ్, జ్ఞానేశ్, జనార్ధన్, మను, దుర్గ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి : సిపిఎం

నర్సీపట్నం శివపురంలో డిఎంకె కళాశాల గుర్తింపు రద్దు చేసి ప్రిన్సిపాల్‌పై నిర్భయ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రిన్సిపాల్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రాజు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి- మాడుగుల:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ, శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగాను ప్రతిరోజు అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, యోగా ఇన్స్ట్రక్టర్ హిమబిందు, అధ్యాపకులు పులవర్తి పైడిరాజు, జె.షర్మిలశ్రీ, రమణమూర్తి, రాజు పాల్గొన్నారు.

చీడికాడ:మానసిక ఒత్తిడిని జయించాలంటే యోగా ఎంతో ముఖ్యమని ఏపీవో నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందు తెలిపారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు యోగా ప్రాముఖ్యతను వివరించారు.

గొలుగొండ:స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై బి. కృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది యోగాసనాలు వేశారు. చోద్యం హైస్కూల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రధానోపాధ్యాయులు జి.రత్నాజీ, పీఈటి కుందూరు నూకరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లులో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కవిత, పిడి ఆదిలక్ష్మి, వేంపాడు ఆయుష్ విభాగం యోగా ట్రైనర్ దవరసింగి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకల్లో సిఐ విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. పెదబోదిగల్లం హైస్కూల్లో హెచ్ఎం సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్య, డిఎల్ పురం హైస్కూల్లో హెచ్ఎం నూకరాజు, స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ప్రిన్సిపల్ షేక్ సలీమా ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. వేంపాడు హైస్కూల్లో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

రోలుగుంట:స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ా యోగలో భాగంగా సూర్య, చంద్ర నమస్కారాలు చేసి వినూత్నంగా యోగా డేను నిర్వహించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా యోగా చేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు.

అనకాపల్లి:ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరిక, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అన్నారు. అనకాపల్లి గవరపాలెం పార్కు సెంటర్, భీశెట్టి అప్పారావు కళ్యాణ మండపంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవ జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ, ఎఎస్పి ప్రభాకర్‌రావు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డిఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ, ఐసిడిఎస్ పీడీ అనంతలక్ష్మి పాల్గొన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లిలో నిర్వహించిన యోగా డే వేడుకల్లో 84వ వార్డు కార్పొరేటర్ మదంశెట్టి చిన్నతల్లి నేలబాబు, జార్జ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భారత స్వాభిమాన ట్రస్ట్ యోగా గురువ భీశెట్టి దొరమ్మ నాయుడు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బిఎస్ఎంకె జోగి నాయుడు, కొణతాల నరసింహారావు, మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు లంబా గౌరి, హెచ్ఎం హెచ్‌బి శ్రీధర్ పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో 104 మంది ఉపాధి కూలీలకు యోగా శిక్షణ నిర్వహించారు. ఎంపిడిఒ అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు పాల్గొన్నారు. మండలంలోని బయ్యవరం యుపి పాఠశాలలో నిర్వహించిన యోగా శిక్షణలో హెచ్ఎం బొడ్డేడ సత్యనారాయణ, ఎఎన్ఎం దేవి పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో యోగా గురువు పెంటకోట సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెంటకోట స్వామి సత్యనారాయణ, ఆడారి జగన్నాధరావు, మద్దాల మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు. తోటాడ ఓంకార పీఠం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సూరిశెట్టి సుషుమ్న కుమార్, ఎస్ కుమార్ రాజా పాల్గొన్నారు.

చోడవరం : చోడవరంలో వాకర్ ఫ్రెండ్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు పప్పల రమణమూర్తి యోగ విశిష్టతను వివరించారు. పతాంజలి యోగ శిక్షణ కేంద్రం పుల్లేటి సతీష్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. పలు వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు గుడివాడ అప్పారావు, నాగూర్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం తదితర గ్రామాల్లో ఉపాధి హామీ కూలీ, నాయకులు యోగాసనాలు వేశారు. ఏపీఓ మురళి, మాజీ ఎంపిటిసి గోన్నాబత్తుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు, పెదిరెడ్ల రాజు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెజిబివి, బంగారు మెట్ట, లోపూడి ప్రాథమిక పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కెజిబివి ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర, అంగన్వాడి కార్యకర్తలు జ్యోతి, లలిత పాల్గొన్నారు

కె.కోటపాడు : మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు యోగ సాధన నిర్వహించారు. ఎంఈఓ డివిడి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సబ్బవరం:. స్థానిక జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో వర్సిటీ రిజిస్టార్ నందిని ఆధ్వర్యాన సిబ్బంది, అధ్యాపకులు యోగాసనాలు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిడి అబ్దుల్ రెహమాన్, హెచ్ఎం ఎస్.తిరుపతిరావు, మొగలిపురంలో యోగా గురువు సిహెచ్.సుబ్రహ్మణ్యం, తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, సిరపరపు రాంబాబు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాలో ఆయుష్ విభాగం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, నేచురోపతి వైద్యులు డాక్టర్ టి.తులసీరావు, బ్రహ్మకుమారి శివలీల, జెసి కె.మయూర్ అశోక్, ఎడిసి కెఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు. పోలీస్ కమిషనరేట్‌లోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఆరిలోవ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్కిల్ డెవలెప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ వద్ద డాక్టర్ కెవివి.సుబ్రహ్మణ్యం, యోగా గురువు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో యోగాసనాలు వేసారు.



యోగాసనాలు వేస్తున్న ఎంపీ శ్రీ భరత్

మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కోడి రామమూర్తి ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి.రెడ్డి, జిమ్సర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమణరావు పాల్గొని స్వయంగా యోగ, ధ్యాన ప్రక్రియలను ప్రదర్శించారు. జిమ్సర్ ప్రోవైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి విద్యార్థులను అభినందించారు.

ఆనందపురం : స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి గంగునాయుడు ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. గుడిలోవ ఏక్యూజే సెంటర్ ఫర్ పీజీ స్టడీస్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు.కళాశాల డైరెక్టర్ సుధారాణి యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఆనందపురం భవిత కేంద్రంలో హెచ్ఎం కె.అంజనా కుమారి, సహిత విద్య ఉపాధ్యాయులు కే శ్రీనివాసరావు, నాగమణి ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

గోపాలపట్నం : స్థానికజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ పాల్గొని యోగాసనాలు వేశారు. 89 వార్డు టిడిపి కార్పొరేటర్ దాడి వెంకట రమేష్. 91వ వార్డు అధ్యక్షులు సత్తిరాజు, మూర్తి పట్నాయక్, దాడి రమేష్ నాయుడు, ద్వారం బాబీ పాల్గొన్నారు.

భీమునిపట్నం :స్థానిక ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో యోగా దినోత్సవంలో జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర రావు, ఫస్ట్ ఎడిఎం జడ్జి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎం సుధాకర్, కోశాధికారి ఎం సునీల్ పాల్గొన్నారు.స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో యోగాడేలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృడైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక సంగివలస, ఎన్నారై ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో యోగా దినోత్సవంలో డీన్ డాక్టర్ పివి సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ పాల్గొన్నారు

వేపగుంట : 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్ గ్రీన్ బెల్ట్‌లో పతంజలి పీఠ్ సభ్యులు ఆధ్వర్యంలో యోగాడేలో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పాల్గొన్నారు. సభ్యులతో కలిసి మజ్జిగ పంపిణీ చేశారు.

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, యోగ శిక్షకురాలు ఎ.సంధ్యారాణి ఆధ్వర్యంలో యోగా దినోత్సవంలో విద్యార్థినులు యోగసనాలు వేశారు. యోగా శిక్షకులు, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రేమకుమారి, ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అభినందించారు.



స్వీట్లు పంచుకుంటున్న కూటమి శ్రేణులు

కూటమి నేతల సంబరాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:కూటమి ప్రభుత్వంలో గెలు పొందిన ఎమ్మెల్యేలు శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో నక్కపల్లిలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, ఆనాడు చంద్రబాబు నాయుడు తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో అడుగు పెడతానని శపథం చేశారని, ఆ విధంగా అడుగు పెట్టడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను వైసీపీ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో మునుపెన్నడు ఎవరికీ రాని విధంగా అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యే వంగలపూడి అనిత గెలుపొంది హోం మంత్రి పదవి దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మీగడ సత్తిబాబు, అడ్డూరి లోవరాజు, అయినంపూడి అప్పల రాజు, కోసూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

త్రుటిలో తప్పిన ప్రమాదం

-స్కూల్ బస్సును ఢీకొన్న వ్యాన్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం స్కూల్ బస్సును వ్యాన్ ఢీకొంది. పెద్దగా ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పాయకరావుపేట నుండి శ్రీ చైతన్య స్కూల్ బస్సు వేంపాడు జంక్షన్ వద్ద స్కూల్ పిల్లలను దింపుతుండగా, వెనక నుంచి వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులు క్షేమంగా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.



అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

పిల్లలను బడికి పంపాలి

ప్రజాశక్తి -చీడికాడ:విద్యార్థులను బడికి పంపాలని మండల విద్యాశాఖ అధికారి బొంజుబాబు కోరారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. బడి ఈడికు వచ్చిన పిల్లలను పనులలో పెట్టకుండా, వెంటనే బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయాలని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.



బ్యాటరీ పని చేయని పశు సంచార వాహనం

బ్యాటరీ పని చేయక పోవడంతో

కదలని పశు సంచార వాహనం

ప్రజాశక్తి -కోటవురట్ల: గడిచిన రెండు రోజులుగా సంచార పశు ఆరోగ్య సేవ వాహనం వృధాగా దర్శనమిస్తుంది. జిఎంఆర్ పర్యవేక్షణలో నడిచే ఈ వాహనాల పర్యవేక్షణ సక్రమంగా నిర్వహించక పోవడంతో వాహనానికి సంబంధించిన బ్యాటరీ పని చేయ లేదు. దీంతో, వాహనం స్టార్ట్ కాలేదు. ఈ కారణంగా ఈ వాహనంలో పనిచేసే సిబ్బంది విధులకు హాజరై తిరిగి వెళుతున్నారు. ఈ పశుసేవా వాహనం ద్వారా కోటవురట్ల, రాయవరం మండలాలకు సంబంధించి పాడి రైతులకు సేవలు అందించేవారు. గడిచిన 20 రోజుల క్రితం వాహనంలో పని చేసే డాక్టర్ బదిలీపై వెళ్లడంతో పారావెట్‌ను మాత్రమే నియమించారు.



కార్యాలయం చుట్టూ ఆవరించి ఉన్న ముళ్ళ తుప్పలు

ముళ్ల పొదల మధ్య..

ఐసిడిఎస్ కార్యాలయం

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లిలో ఐసిడిఎస్ కార్యాలయం చుట్టూ ముళ్ళ తుప్పలు ఆవరించి ఉండటంతో కార్యాలయ ఉద్యోగులు, అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగించేవారు. కొన్నేళ్ల క్రితం నక్కపల్లి వారపు సంత ఆవరణంలో సొంత భవనం నిర్మించారు. నక్కపల్లితో పాటు ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల మండలాలకు ఇదే ప్రధాన కార్యాలయం. ఈ కార్యాలయం చుట్టూ పెద్ద పెద్ద ముళ్ళ చెట్లు ఆవరించి ఉన్నాయి. దీంతో, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, అంగన్వాడి వర్కర్స్ తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అప్పుడప్పుడు అంగన్వాడి వర్కర్స్‌కు ఈ కార్యాలయం లోనే సమావేశాలు నిర్వహిస్తూ ఉంటారు. కార్యాలయం చుట్టూ ముళ్ళ చెట్లు ఆవరించి ఉండటంతో విష సర్పాలు కార్యాలయంలోనికి చొరబడే అవకాశాలు ఉన్నాయని భయాందోళన చెందుతున్నారు. దీంతో పాటు కార్యాలయానికి రహదారి సౌకర్యం కూడా సరిగ్గా లేదు. వర్షం కురిసినప్పుడు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

17 నెలల వేతనాలు చెల్లించండి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో క్షేత్రస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు గత 17 నెలలుగా వేతనాలు మంజూరు కాలేదని, తక్షణమే చెల్లించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కొంట్యాడ సన్యాసిరావు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఉద్యోగుల పట్ల గత ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించారని తక్షణం నూతన ప్రభుత్వం బకాయి పడ్డ 17 నెలల జీతాలు చెలించాలన్నారు.

ఘనంగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా సాగింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 13 మంది ప్రమాణ స్వీకారం చేశారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.



వంగలపూడి అనిత (పాయకరావుపేట)



కొణతాల రామకృష్ణ(అనకాపల్లి)



కెఎస్ఎన్ఎస్.రాజు (చోడవరం)



బండారు సత్యనారాయణ మూర్తి (మాడుగుల)



సుందరపు విజయ్‌కుమార్ (యలమంచిలి)



పంచకర్ల రమేష్‌బాబు (పెందుర్తి)



విష్ణుకుమార్‌రాజు (విశాఖ ఉత్తరం)



వెలగపూడి రామకృష్ణబాబు (విశాఖ తూర్పు)



గంటా శ్రీనివాసరావు (భీమిలి)



గణబాబు (విశాఖ పశ్చిమం)



పల్లా శ్రీనివాసరావు (గాజువాక)



వంశీకృష్ణ శ్రీనివాస్ (విశాఖ దక్షిణం)

గ్యాస్ వినియోగదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి- కోటవురట్ల: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని వాగ్దానం చేసింది. దీంతో ఇకెవైసి చేసుకోవడం కోసం గ్యాస్ వినియోగదా రులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

మండలంలోని వినియోగదారులు వివిధ గ్యాస్ ఏజెన్సీలకు సంబంధించి ఇకెవైసీ నిమిత్తం తెల్లవారక ముందే ఏజెన్సీ వద్ద బారులు తీరి దర్శనమిస్తున్నారు. లబ్ధిదారుని ఎల్పిజి ధృవపత్రం ఆన్లైన్‌లో కేవైసీ చేసుకోవాలంటూ గ్యాస్ ఏజెన్సీలు ప్రకటించ డంతో లబ్ధిదారులకు ఇక్కట్లు మొదలయ్యాయి.

ఇకెవైసి కోసం అగచాట్లు

మండలంలో ఇండేన్, భారత్, హిందుస్థాన్ పెట్రోలియం, కంపెనీ గ్యాస్‌ను విక్రయిస్తున్నారు. కేవలం ఇండేన్ కంపెనీ ఏజెన్సీ మాత్రమే మండలంలో ఉండటంతో లబ్ధిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై అధికారుల నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోయినప్పటికీ లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకునేందుకు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని పలువురు కోరుతున్నారు.



ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు